# మాకేవరు అడిగేది ?



రుద్రూర్, బతుకమ్మ : భూ బకాసురుల ఆగడాలు రోజు రోజుకు మితిమీరిపోతుంది. ఖాళీగా భూమి ఉందంటే అది వరద కాలువనా లేక పంట కాలువనా, రహదారినా అని చూడడం లేదు. తర్వాత పొలాల వారికి నీళ్లు అవసరం, దారి అవసరం అని కూడా ఆలోచన లేదు. నాకు మాత్రం పది గుంటలు కలిసిందా, నాకు ఐదు గుంటలు కలిసిందా అని పోటీ పడుతున్నారు. కానీ తరువాత పొలాల వాళ్ళ గూర్చి ఆలోచన కొంచం కూడా లేక పోవడం ఎంతో బాధాకరం. పది మీటర్ల వెడల్పు ఉన్న కాలువలు సైతం ఒక మీటర్ వెడల్పు కి రావడం కొన్నిచోట్ల పూర్తిగా అదృశ్యం కావడం బాధాకరం. కొందరు రాజకీయ బలంతో, కొందరు అధికారుల బలంతో ఇష్టారాజ్యాంగా భూమిని మాయం చేస్తున్నారు. ఏళ్ళ తరబడి అక్రమ కబ్జాలు ఉన్నా వీటి గురించి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వాళ్ళు పట్టించుకోకపోవడం ఆలోచించాల్సిన విషయం. కొందరు రైతులు నిరంతర యుద్ధం చేస్తున్నా అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేదు. ఈ భూకబ్జాల వలన కొందరు రైతుల పొలాలు వరదల సమయంలో పూర్తిగా మునిగిపోయి నష్ట పోవడం జరుగుతుంది. రహదారులు కూడా చిన్నవై పోతున్నాయి. కొందరు ప్రభుత్వ భూమిలోనే బోరు బావిలు సైతం త్రవ్వడంతో, ట్రాక్టర్ డ్రైవర్లు సైతం ఇబ్బంది పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో చిన్న సన్నకారు రైతులు తమ పశువులు సైతం వరద కాలువల వెంబడి, రహదారుల వెంబడి మేత తినేవి అని ఇప్పుడు కాలువలు లేకపోవడం వలన పశువులు అమ్ముకుంటున్న పరిస్థితి వచ్చిందని చెప్పుకుంటున్నారు. రుద్రూర్ మండల కేంద్రంలో రుద్రూరు మరియు అక్బర్ నగర్ సరిహద్దున ఉన్నటువంటి మల్లయ్య గుట్టకి, నక్కలొర్రే వాగుకి వెళ్ళు రహదారి సర్వే నెంబర్ 109/1, నక్కలొర్రే వాగు దాని అనుబంధంగా ఉన్న వాగులు, పంట కాలువల భూ కబ్జా గూర్చి ప్రచురణ రావడంతో రైతులు మళ్ళీ మళ్ళీ న్యాయం కోసం రుద్రూర్ మండల రెవెన్యూ అధికారిని కలిసి తమకి న్యాయం చేయమని అడగడం జరిగింది. అందుకు వారు వెంటనే ఈ విషయం గూర్చి, భూమి విషయం గూర్చి సర్వేయర్ కు, వరద కాలువలు, పంట కాలువలు గురించి నీటి పారుదల శాఖ అధికారికి అదే విధంగా రహదారి గూర్చి రహదారులు, భవనాలు శాఖ, పంచాయతీ రాజ్ శాఖ వారికి సమాచారం ఇచ్చి రెండు రోజుల వ్యవధిలోనే సమస్యకి పరిష్కారం చూపుతానని చెప్పి ఎవరైతే అక్రమంగా ఆక్రమణ చేసారో అట్టి భూమిని పునరుద్దరణ చేసి, కాలువలకి రహదారులకి పూర్వవైభవం తీసుకొస్తానన్నారు. అదే విధంగా వరదల సమయంలో పొలాలకి నష్టం జరగకుండా చూస్తా అని హామీ ఇచ్చి రైతులపై తనకున్న అభిమానం చాటుకున్నారు. మండల రెవెన్యూ అధికారి తారాబాయి వెంటనే స్పందించి తమకి న్యాయం చేస్తాం అని చెప్పడంతో రైతులు హర్షం వ్యక్తం చేసారు.

# చెడు అలవాట్లతో భవిష్యత్తు నాశనం చేసుకోవద్దు




నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీడలు, విద్యపై దృష్టి సారించాలని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి పిలుపునిచ్చారు. నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రీమియర్ లీగ్ క్రీడా పోటీలు ఏప్రిల్ 20 నుండి 28 వరకు జరగగా, ఇందులో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, బాస్కెట్ బాల్, యోగా వంటి విభిన్న క్రీడలు నిర్వహించారు. మంగళవారం ప్రీమియర్ లీగ్ ముగింపు కార్యక్రమం ఉమెన్స్ కళాశాల మైదానంలో నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి హాజరై మాట్లాడుతూ.. యువతకు నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో ప్రీమియర్ లీగ్, క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. నగరంలో పెరుగుతున్న చెడు అలవాట్లు, ముఖ్యంగా రాత్రి సమయంలో జరిగే బెట్టింగ్ కార్యకలాపాలపై యువత అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. మంచి భవిష్యత్తు కోసం లక్ష్యంతో ముందుకు సాగాలని, తప్పుదారులు పట్టకూడదని యువకులకు సూచించారు. యువత జీవిత నిర్మాణ దశలో ఉన్నందున చెడు అలవాట్లకు లోనైతే భవిష్యత్తు నాశనం అవుతుందని హెచ్చరించారు. క్రీడలు, విద్య, మంచి ఆలోచనలతో జీవితాన్ని సానుకూల దిశలో తీర్చిదిద్దుకోవాలని సూచించారు. నగరంలో రాత్రి 11:30 తర్వాత జరుగుతున్న బెట్టింగ్ కార్యకలాపాలను అరికట్టాల్సిన అవసరం ఉందని, ఈ విషయంలో పోలీస్ అధికారులు విధుల్లో నిర్లక్ష్యం చేయకుండా కఠిన చర్యలు



తీసుకోవాలని కోరారు.
అనంతరం పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ యువత చదువులతోపాటు క్రీడల్లో కూడా చురుకుగా పాల్గొనాలని సూచించారు. విద్యార్థులు తమ కాలేజీ సమయాన్ని వృథా చేసుకోకుండా క్రీడల ద్వారా శారీరక సామర్థ్యం, మానసిక తేజస్సు, ఉత్సాహం, సామాజిక చైతన్యం పెంపొందించుకోవచ్చని తెలిపారు.తెలంగాణ ప్రభుత్వం క్రీడలు, టూరిజం రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని, నిజామాబాద్ జిల్లాలో రన్నింగ్ ట్రాక్స్, వాకింగ్ ట్రాక్స్ నిర్మాణాలకు నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. గత ప్రభుత్వంతో పోలిస్తే ప్రస్తుత ప్రభుత్వం క్రీడారంగానికి భారీగా నిధులు కేటాయించిందన్నారు.నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య మాట్లాడుతూ క్రీడలు వ్యక్తిత్వ వికాసానికి ఎంతో దోహదపడతాయని తెలిపారు. తాను కూడా క్రీడల వల్లనే ఐపీఎస్ ఇంటర్వ్యూలో విజయాన్ని సాధించానని చెప్పారు. యువత మొబైల్ వ్యసనం, మత్తు పానీయాల నుండి దూరంగా ఉండేందుకు క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రీమియర్ లీగ్ క్రీడా పోటీలు ఏప్రిల్ 20 నుండి 28 వరకు జరిగాయని, ఇందులో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, బాస్కెట్బాల్, యోగా వంటి విభిన్న క్రీడలు నిర్వహించడం విశేషమన్నారు. ఉమెన్స్ కళాశాల మైదానంలో ఈ పోటీలు విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. “సే నో టు డ్రగ్స్ – సే యెస్ టు స్పోర్ట్స్” అనే నినాదంతో యువత ముందుకు సాగాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు డిసిపి అడ్మిన్ శుభం ప్రకాష్ , రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, నగర మేయర్ కూరగాయల ఉమారాణి, నుడా చైర్మన్ కేశ వేణు, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పగంగారెడ్డి, నిజామాబాద్ , ఆర్మూర్, బోధన్, ట్రాఫిక్, సి టి సి ఎ సి పి లు సిఐలు, ఎస్సైలు, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందన్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నగేష్ రెడ్డి, కార్పొరేషన్ డిసిసి అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ, అడ్వకేట్ రాజేందర్రెడ్డి, ఎన్ ఎస్ సి నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కవిత రెడ్డి, కోశాధికారి సంతోష్ కుమార్, సంయుక్త కార్యదర్శులు రజనీకాంత్, శిరీష్, శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ ఉష, డివైఎస్ వో పవన్ కుమార్, మల్లేష్ గౌడ్, మీసాల ప్రశాంత్, అజ్మత్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌ను ప్రపంచానికి గేట్‌వేగా మార్చేది ఫ్యూచర్ సిటీ



ఇక ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపనతో పాటు మల్కాజ్ గిరి కమిషనరేట్ భవనం, ఆక్టోపస్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, కుత్బుల్లాపూర్ డిసిపీ కార్యాలయ భవనాలను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణా రావు, డి.శ్రీధర్ బాబు, శాసన మండలిలో చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, అనీల్ కుమార్ యాదవ్, శాసన సభ్యుడు మల్ రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తర తెలంగాణ ఉడుకుతుంది

ఉమ్మడి నిజమాబాద్ జిల్లా వ్యాప్తంగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. జిల్లాలో సోమవారం రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నిజామాబాద్ జిల్లా మెండోరాలో 46 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డ్ అయింది. కామారెడ్డి జిల్లా బిచ్కుందలో45.5నమోదయింది. ఇవాళ కూడా నిజామాబాద్ నగరంతో పాటు మెండోరా, మాక్లూర్, ఏర్గట్ల, మోపాల్, ధర్పల్లి, నిజామాబాద్ రూరల్ మండలంలో 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.ఉదయం 10 గంటలు దాటితే రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఉదయం 10 నుండి సాయంకాలం 5 గంటల వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఉత్తర భారత దేశం నుండి వీచే గాలులతో పాటు విదర్భ నుండి వీస్తున్న గాలుల కారణంగా ఉష్ణోగ్రతలు పెరిగాయంటున్నారు వాతావరణ శాఖ అధికారులు. రానున్న రోజుల్లో మరింత ఉష్ణోగ్రతలు పెరుగుతాయంటున్నారు వాతావరణ శాఖాధికారులు.. జిల్లాలో ఎండల తీవ్రతపై మరింత పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు 47 డిగ్రీల సెల్సియస్ గా ఉంది. ఈ సారి ఎండకాలంలో కొత్త రికార్డులు నమోదు ఖాయమని చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే వడ దెబ్బల బారిన పడు ఇద్దరు రైతులు ప్రాణాలు వదిలారు. ఆ సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

## మంత్రి సీతక్క పర్యటన ఏర్పాట్లను
# పరిశీలించిన కలెక్టర్



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి, నిజామాబాద్ ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి ధనసరి అనసూయ సీతక్క బుధవారం నిజామాబాద్ జిల్లాలో పర్యటించనున్న నేపధ్యంలో మంత్రి పర్యటన ఏర్పాట్లను కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలలో ఇన్ చార్జి మంత్రి పాల్గొననుండగా, కలెక్టర్ ఆడిటోరియంను సందర్శించారు. ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారులకు సూచనలు చేశారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఇంచార్జి అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, డీఆర్డీఏ సాయన్న, ఆర్డీఓ రాజేంద్ర కుమార్, డీడబ్ల్యూఓ పద్మ తదితరులు ఉన్నారు.

# చందూర్ మండలంలో డబుల్ మర్డర్



వర్ని, బతుకమ్మ:నిజామాబాద్ జిల్లాలో దారుణం జరిగింది. తనతో సహజీవనం చేస్తున్న మహిళ మాట్లాడటం లేదని, తనను దూరం పెట్టిందని అనుమానంతో ఆమెను హత్య చేశాడు ప్రియుడు. విషయం తెలిసిన మహిళ కుటుంబ సభ్యులు అతడిపై దాడి చేసి హతమార్చారు. ఈ సంఘటన నిజామాబాద్ జిల్లా చందూర్ మండలం పోట్టి గుట్ట తాండాలో జరిగింది. చందూర్ మండలం పోట్టిగుట్ట తాండాకు చెందిన కవిత(30)కు మెడిపల్లి తాండాకు చెందిన వ్యక్తితో ఇది వరకు వివాహం జరిగి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇటీవల కాలంలో కవిత భర్త చనిపోవడంతో అదే తాండాకు చెందిన ఆనంద్ (36) కవిత సహజీవనం చేస్తుంది. ఇటీవల కాలంలో ఇద్దరి మద్య బేదాభిప్రాయాల కారణంగా, తాండాలో పరిస్థితుల నేపథ్యంలో కవిత పుట్టింటికి పోట్టిగుట్ట తాండాకు వచ్చి పిల్లలతో సహా నివసిస్తుంది. ఆనంద్ ఫోన్ చేసిన స్పందించకపోవడం తో తనను దూరం పెట్టిందనే అనుమానంతో సోమవారం పోట్టిగుట్ట తాండాకు వచ్చి గొడవ పడ్డారు. అక్కడే ఉన్న పారతో కవిత తలపై మొదడంతో తీవ్ర రక్త స్రావంతో ఆమె అక్కడికక్కడే చనిపోయింది. విషయం తెలిసిన కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఆనంద్ ను పట్టుకుని తీవ్రంగా చితక బాదారు. ఆ దెబ్బలకు ఆనంద్ తీవ్ర గాయాలతో పడిపోయాడు. విషయం తెలిసిన వర్ని పోలిసులు ఆనంద్ ను మెరుగైన చికిత్స కోసం అంబులెన్స్ లో జిల్లా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయారు. ఈ మేరకు వర్ని పోలిసులు ఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.